క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీమకుర్తి రూరల్: మండలంలోని పడమటి నాయుడుపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో 33/11కేవీ లైన్‌కు మరమ్మతుల నిమిత్తం శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈఈ మోహనరావు తెలిపారు. పడమటి నాయుడుపాలెం, బండ్లమూడి, తొర్రగుడిపాడు, ఎర్రగుడిపాడు, మంచికలపాడు, చీమలమర్రి, రెడ్డినగర్‌లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

శానిటేషన్ సర్వే పరిశీలన

సంతనూతలపాడు: మండలంలోని చంద్రపాలెం గ్రామంలో పారిశుధ్యం, స్వామిత్వ సర్వేలను శుక్రవారం ఎంపీడీవో డి.సురేష్ బాబు తనిఖీ చేశారు. హౌస్ టూ హౌస్ గార్బేజ్ కలెక్షన్, పారిశుధ్య కార్యక్రమాలు, స్వామిత్వ సర్వేలను పరిశీలించి పంచాయతీ కార్యదర్శి మౌనిక, సచివాలయ సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు.

క్విజ్ పోటీల్లో హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

సంతనూతలపాడు: సంతనూతలపాడు హైస్కూల్ విద్యార్థులు బి.నాగ ప్రియాంక, కె.జ్ఞానేశ్వరి అంతర్జాతీయ అంతరిక్ష వారోత్సవాలు–2025 కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారు. శ్రీహరికోట సార్ డైరెక్టర్ పద్మ కుమార్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందుకున్నారు. సంతనూతలపాడు హైస్కూల్లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో వారిని హైస్కూల్ హెచ్‌ఎం ఎం.ప్రమోద, ఉపాధ్యాయులు అభినందించారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

ఒంగోలు సిటీ: జూన్ 2025లో జరిగిన ఉపాధ్యాయుల బదిలీలలో బదిలీ అయి ఇప్పటికీ రిలీవ్ కాని ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జనార్దనరెడ్డి, శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. వివిధ కేడర్లలో పనిచేస్తూ నూతన స్థానాలు పొందిన వారు రిలీవర్ లేక పాత స్థానాలలో కొనసాగుతున్నారని తెలిపారు. అలాంటి వారిని రిలీవర్‌తో సంబంధం లేకుండా వెంటనే రిలీవ్ చేయాలని కోరారు. నూతన డీఎస్సీ ద్వారా కొత్త ఉపాధ్యాయులను నియమించినప్పటికీ 563 ఎస్జీటీ పోస్టులు ఖాళీలుగా ఉన్నాయన్నారు. ఆ ఖాళీలను విద్యా వలంటీర్ల ద్వారా పూర్తి చేయాలని కోరారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టులను ప్రమోషన్ ద్వారా భర్తీ చేయాలన్నారు. 2025 ఏప్రిల్‌లో ఎస్ఎస్‌సీ స్పాట్ వాల్యూయేషన్ చేసిన ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్‌లు చెల్లించారని, టీఏ, డీఏలు చెల్లించలేదని, వెంటనే టీఏ, డీఏలు చెల్లించాలని కోరారు.

పాఠశాలకు బీరువా, మైక్‌సెట్ బహూకరణ

చీమకుర్తి రూరల్: మండలంలోని గోనుగుంట గ్రామంలో ప్రాథమిక పాఠశాలకు విశాల పరపతి సొసైటీ అధ్యక్షుడు పూనాటి వెంకటరావు బీరువా, మైక్‌సెట్‌ను శుక్రవారం అందజేశారు. వారిని పాఠశాల సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓలు నరసింహారావు, శివాజీ, గోనుగుంట కాంప్లెక్స్ చైర్మన్ శ్రీనివాసరావు, సర్పంచ్ మోహన్‌రావు, హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు రమణయ్య, రమాదేవి, మిధిల, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోస్ట్‌కార్డులు, స్టాంపులపై అవగాహన కార్యక్రమం



అవగాహన కల్పిస్తున్న సబ్ పోస్ట్‌మాస్టర్

చీమకుర్తి: నేషనల్ పోస్టల్ వీక్ సందర్భంగా శుక్రవారం చీమకుర్తిలోని పోస్టాఫీస్‌లో సబ్ పోస్ట్‌మాస్టర్ కే రామారావు ఆధ్వర్యంలో విద్యార్థులకు పోస్ట్‌కార్డులు, స్టాంపులపై అవగాహన కల్పించారు. పోస్టాఫీస్‌లో లభించే సేవల గురించి వివరించారు.

పిల్ల కాలువలు కాదు..
పెద్ద రోడ్లే..!



రామతీర్థం కూడలి నుంచి ఆర్‌ఎల్ పురం వరకు గోతుల్లో వర్షం నీరు చేరిన రహదారి



కమ్మంపాడు గ్రామంలోని ఫ్యాక్టరీల వద్ద గోతులమయంగా ఉన్న పంచాయతీ రోడ్డు

కూటమి ప్రభుత్వం రాగానే రోడ్లన్నింటికీ మరమ్మతులు చేయించామని, ఇంకా ఎంతో అభివృద్ధి సాధించామని చెప్పకుంటూ సీఎం చంద్రబాబు నుంచి ఆ పార్టీ ఎమ్మెల్యేల వరకూ బాకా ఊదుకుంటూ సంబరాలు చేసుకుంటున్నారు. కానీ, ప్రజలు మాత్రం మోకాల్లోతు గుంతలతో నిండిపోయి వర్షం కురిస్తే ఆ గుంతల్లో భారీగా నీరు చేరి పిల్ల కాలువలను తలపిస్తున్న రోడ్లపై కిందామీదా పడి ప్రయాణిస్తూ నిత్యం నరకం చూస్తున్నారు. చీమకుర్తి మండలంలో పలు రోడ్లను గమనిస్తే కూటమి ప్రభుత్వంలో రోడ్ల దుస్థితి ఏ విధంగా ఉందో అర్థమవుతోంది. మండలంలోని రామతీర్థం కూడలి నుంచి ఆర్‌ఎల్ పురం వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి చిన్నపాటి వర్షం కురిసినా అత్యంత దారుణంగా తయారవుతోంది. వాహనాలు రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొంటోంది. వాహనదారులకు చుక్కలు చూపిస్తోంది. ఈ రహదారిపై గ్రానైట్ లారీలు, కంటైనర్లు అధిక బరువుతో తిరగడం వలన ఛిద్రమైపోయింది. చినుకు పడితే చిత్తడిగా మారడంతో పాటు అడుగడుగునా ఏర్పడిన గుంతల్లో నీరు చేరుతోంది. ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడి ప్రమాదాలు జరుగుతున్నాయి. గుంతల్లో లేచిపడుతూ కార్ల కిందిభాగాలు రోడ్డుకు తగిలి దెబ్బతింటున్నాయి. బస్సుల్లో ప్రయాణించే వారికి నడుములు విరుగుతున్నాయి. అదేవిధంగా కమ్మంపాడు నుంచి కారుమంచి కాలువ మీదుగా చీమకుర్తి వెళ్లే పంచాయతీ రోడ్డంతా వర్షం నీరు చేరి పిల్ల కాలువను తలపిస్తోంది. పాలకులు, అధికారులు తక్షణమే స్పందించి ఆయా రోడ్లకు మరమ్మతులు చేయించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. **- చీమకుర్తి రూరల్**



ఆర్‌ఎల్ పురం సమీపంలో చిన్నపాటి చెరువును తలపిస్తున్న రోడ్డు



కమ్మంపాడు నుంచి కారుమంచి కాలువ వరకు గ్రామ పంచాయతీ రోడ్డు దుస్థితి

కోటి సంతకాల సేకరణ పోస్టర్ ఆవిష్కరణ

మద్దిపాడు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలకు నిరసనగా, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను శుక్రవారం ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. మద్దిపాడులోని పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ మద్దిపాడు మండల ఉపాధ్యక్షుడు వాకా కోటిరెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మోరబోయిన సంజీవరావు, నాయకులు గుడ్డ



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ మద్దిపాడు మండల ఉపాధ్యక్షుడు వాకా కోటిరెడ్డి, నాయకులు

పాతల రవి, దుడ్డు వినోద్ కుమార్, రజని, బెజవాడ రాము, రాయపాటి విల్సన్, ఆరబోలు ప్రభుదాస్, నల్లూరి రాంబాబు, చల్లపల్లి జయమ్మ, శ్రీరామ్మూర్తి, నాయకులు పాల్గొన్నారు.

కోలాహలంగా ఆటల పోటీలు



గుండ్లాపల్లిలో లాంగ్ జంప్ చేస్తున్న విద్యార్థులు



చీమకుర్తిలో మండల స్థాయి క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓలు

మద్దిపాడు: మండల స్థాయి ఆటల పోటీలను గుండ్లాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రెండోరోజు కోలాహలంగా నిర్వహించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పలు విభాగాలలో పోటీపడి ఆడారు. కబడ్డీలో గుండ్లాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మద్దిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల జట్లు ఫైనల్స్‌లో తలపడ్డాయి. రెండు పాయింట్ల తేడాతో గుండ్లాపల్లి జట్టు విజయం సాధించింది.

అండర్–17 బాలికల విభాగంలో విజేతలు...

కబడ్డీ విన్నర్స్ గుండ్లాపల్లి, రన్నర్స్ మద్దిపాడు జీహెచ్‌ఎస్, వాలీబాల్ విన్నర్స్ గుండ్లాపల్లి, రన్నర్స్ ఇనమనమెళ్లూరు, చెస్ విన్నర్స్ మద్దిపాడు జీహెచ్‌ఎస్, రన్నర్స్ జెడ్పీహెచ్‌ఎస్ లింగంగుంట, యోగా విన్నర్స్ మద్దిపాడు, రన్నర్స్ జెడ్పీహెచ్‌ఎస్ గుండ్లాపల్లి.

అండర్–14 బాలికల విభాగంలో...

కబడ్డీ విన్నర్స్ గుండ్లాపల్లి, రన్నర్స్ ఇనమనమెళ్లూరు, ఖోఖో విన్నర్స్ గుండ్లాపల్లి, రన్నర్స్ తెల్లబాడు, వాలీబాల్ విన్నర్స్ గుండ్లాపల్లి, రన్నర్స్ మద్దిపాడు, చెస్ విన్నర్స్ మద్దిపాడు, రన్నర్స్ గుండ్లాపల్లి, యోగా విన్నర్స్ మద్దిపాడు, రన్నర్స్ గుండ్లాపల్లి.

అండర్–17 బాలుర విభాగంలో విజేతలు...

కబడ్డీ విన్నర్స్ గుండ్లాపల్లి, రన్నర్స్ మద్దిపాడు, వాలీబాల్ విన్నర్స్ గుండ్లాపల్లి, రన్నర్స్ జీహెచ్‌ఎస్ మద్దిపాడు, వాలీబాల్లో విన్నర్స్ గుండ్లాపల్లి, రన్నర్స్ ఇనమనమెళ్లూరు, చెస్ విన్నర్స్ జీహెచ్‌ఎస్ మద్దిపాడు, రన్నర్స్ లింగంగుంట, యోగా విన్నర్స్ మద్దిపాడు, జీహెచ్‌ఎస్ గుండ్లాపల్లి.

అండర్–14 బాలుర విభాగంలో...

కబడ్డీ విన్నర్స్ జీహెచ్‌ఎస్ మద్దిపాడు, రన్నర్స్ పెద్ద కొత్తపల్లి, ఖోఖో విన్నర్స్ జీహెచ్‌ఎస్ మద్దిపాడు, రన్నర్స్ జెడ్పీహెచ్‌ఎస్ గుండ్లాపల్లి, వాలీబాల్ విన్నర్స్ బసవన్నపాలెం, రన్నర్స్ పెద్దకొత్తపల్లి.

చీమకుర్తి మండల క్రీడా పోటీలు ప్రారంభం...

చీమకుర్తి: మండల స్థాయి స్కూలు గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీలను శుక్రవారం చీమకుర్తిలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రారంభించారు. ఎంఈఓ–1, 2 డీవీఎల్ నరసింహారావు, కే శివాజీ, హైస్కూలు హెచ్‌ఎం కుమార్, స్కూలు గేమ్స్ ఫెడరేషన్ మండల కో ఆర్డినేటర్ డీ స్వరూపావాణి చేతుల మీదుగా ప్రారంభించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. చీమకుర్తి ఎంపీయూపీ స్కూల్లో 8వ తరగతికి చెందిన కే బిందుశ్రీ, బీ మాధవి, ఎస్‌కే వహీద్, 6వ తరగతికి చెందిన కే శరత్ అండర్–14 విభాగంలో కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం వద్ది మోహన్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను హెచ్‌ఎంతో పాటు వారి తల్లిదండ్రులు అభినందించారు.



గుండ్లాపల్లిలో విద్యార్థుల ఆటలను తిలకిస్తున్న తోటివిద్యార్థులు



చీమకుర్తిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు

గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి

ఒంగోలు టౌన్: ప్రమాద సంకేతాలు గల గర్భిణులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు ఆదేశించారు. శుక్రవారం జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో మాతృమరణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రమాద సంకేతాలు గల గర్భిణులను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి వారి బర్త్ ప్లాన్ తయారు చేయాలని సూచించారు. వైద్యాధికారి, సూపర్‌వైజర్ సమక్షంలో వారికి ప్రొటోకాల్ వైద్యాన్ని అందించాలని చెప్పారు. ప్రమాద సంకేతాలు గల గర్భిణులను 108 ద్వారా సమీపంలోని ఎంసీహెచ్, సర్వజన ఆస్పత్రులకు తరలించాలని చెప్పారు. ప్రతినెలా 10వ తేదీ నిర్వహించే ప్రధాన మంత్రి మాతృ వందన కార్యక్రమానికి గర్భిణులను తీసుకొచ్చి అవసరమైన పరీక్షలు చేయించాలని ఆదేశించారు. అవసరమైన వైద్య పరీక్షలతో పాటు స్కానింగ్, టిఫా చేయించి రిపోర్టు వివరాలను గర్భిణీ కుటుంబ సభ్యులకు తెలియజేయాలని సూచించారు. ప్రతి గర్భిణీకి కచ్చితంగా ఈసీజీ పరీక్ష చేయించాలని చెప్పారు. కార్యక్రమంలో ఐఎంఏ ప్రతినిధి డా.మణిబాబు, కమల ఫాగ్సే ప్రతినిధి డాక్టర్ కమలశ్రీ, డాక్టర్ కాశీ చైతన్య, సీడీపీఓ ఎంకే వరమ్మ, మాస్ మీడియా అధికారి దాసరి శ్రీనివాసులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలపై అవగాహన కలిగి ఉండాలి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రాజా బాబు

ఒంగోలు సబర్బన్: రెవెన్యూ సమస్యలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండటంతో పాటు రెవెన్యూ సమస్యలపై వచ్చే అర్జీలపై క్షేత్ర స్థాయిలో సమగ్రంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ పి.రాజాబాబు పేర్కొన్నారు. ఒంగోలు కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో కలెక్టర్ రాజాబాబు, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల కృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసులతో కలసి రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారులతో శుక్రవారం సమావేశమయ్యారు. పీజీఆర్ఎస్, రెవెన్యూ సమస్యలు, మ్యుటేషన్లు, జిల్లాకు సంబంధించిన ఐవీఆర్ఎస్ కాల్స్ తదితర అంశాలపై సమీక్షించి తగు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. క్షేత్ర స్థాయిలో వచ్చిన వివిధ రెవెన్యూ సమస్యలను ఏ విధంగా పరిష్కారం చూపారన్న విషయాలపై సమగ్రంగా డాక్యుమెంటేషన్ చేసి తహసీల్దార్లు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. వీటిపై కలెక్టర్ రెవెన్యూ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ సమస్యలపై వచ్చే అర్జీల్లో సుమారు 70 నుంచి 80 శాతం అర్జీలు రెవెన్యూ సంబంధిత అంశాలపై వస్తాయన్నారు. జేసీ గోపాల కృష్ణ మాట్లాడుతూ ఇటీవల కనిగిరిలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో 814 దరఖాస్తులు రాగా, అందులో 587 దరఖాస్తులు రెవెన్యూ సంబంధిత సమస్యలపై అర్జీలు వచ్చాయని, సమస్యల వారీగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఒంగోలు ఆర్డీఓ అధికారి కళావతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.

తల్లి భూదేవమ్మకు జూపూడి నివాళులు



భూదేవమ్మకు నివాళులర్పిస్తున్న జూపూడి ప్రభాకర్‌రావు, నాయకులు

కొత్తపట్నం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్‌రావు తన తల్లి భూదేవమ్మ 13వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్వగ్రామమైన కొత్తపట్నం మండలం సంకువారిగుంట వచ్చారు. భూదేవమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు సీపీఐ జిల్లా నాయకులు రామలింగం రామకృష్ణారెడ్డి, బేతాళ శ్రీనివాసరావు, అల్లూరు ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు, కొప్పోలు హనుమంతరావు, జేఏసీ చైర్మన్ ఏడుకొండలు, రవికుమార్, కృష్ణ, శ్రీరాములు పాల్గొని భూదేవమ్మకు నివాళులర్పించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని నిమిషం పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా జూపూడి ప్రభాకర్‌రావు మాట్లాడుతూ తన తల్లి తమ కోసం చేసిన త్యాగాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం కొద్దిసేపు గ్రామస్తులతో జూపూడి మాట్లాడారు.

ఏఎంఆర్ సంస్థ ద్వారా సీనరేజీ వసూళ్లను రద్దు చేయాలి



మాధవ్‌కు వినతిపత్రం అందిస్తున్న శ్రీనివాసరావు

చీమకుర్తి: గ్రానైట్ క్వారీలు, ఫ్యాక్టరీల నుంచి గ్రానైట్ సీనరేజీ వసూలు చేసే బాధ్యతను ఏఎంఆర్ సంస్థ నుంచి రద్దు చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుండా శ్రీనివాసరావు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌కు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం విజయవాడలో ఆయనను కలిసి మాట్లాడారు. గ్రానైట్ ఫ్యాక్టరీల నుంచి చెల్లించే రాయల్టీని ఏఎంఆర్ సంస్థకు ప్రభుత్వం అప్పగించడానికి నిరసనగా ప్రకాశం జిల్లాలో దాదాపు 2500 గ్రానైట్ ఫ్యాక్టరీలు ఈ నెల 1వ తేదీ నుంచి సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. గ్రానైట్ ఫ్యాక్టరీల మూత వలన వాటిలో పనిచేసే కార్మికులు ఉపాధి కోల్పోయారని చెప్పారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఏఎంఆర్ సంస్థను రాయల్టీ వసూళ్ల బాధ్యత నుంచి తప్పించాలని గుండా శ్రీనివాసరావు ఇచ్చిన వినతిపత్రంలో కోరారు.

ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



ఏడీకి వినతిపత్రం అందజేస్తున్న ఏపీ టీచర్స్ గిల్డ్ నాయకులు

ఒంగోలు సిటీ: ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకటరావు, సీహెచ్ ప్రభాకరరెడ్డి కోరారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ పీవీడి వరప్రసాద్‌ను కలిసి ఎయిడెడ్ ఉపాధ్యాయులు, విద్యార్థుల సమస్యలపై వినతిపత్రాన్ని ఏపీటీజీ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎయిడెడ్ పాఠశాలలకు ఆయాలను నియమిస్తే టాయిలెట్ క్లీనింగ్ మెటీరియల్ ఇస్తామని ఏడీ తెలిపినట్లు చెప్పారు. విద్యార్థులు లేని 17 పాఠశాలల్లో పనిచేసే 48 మంది ఉపాధ్యాయులకు త్వరలో కౌన్సిలింగ్ నిర్వహిస్తామని చెప్పారన్నారు. 35 ఎయిడెడ్ పాఠశాలలకు ఫైనల్ నోటీసు పంపి చర్యలు తీసుకుంటామన్నారని తెలిపారు. ఎయిడెడ్ ఉపాధ్యాయుల 24 సంవత్సరాలు, 30 సంవత్సరాల ఫైల్స్‌ను 15 రోజుల్లోపు పరిష్కరిస్తామని చెప్పినట్లు తెలిపారు.

ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి



ఐద్వా పతాకాలను ఆవిష్కరిస్తున్న మహిళా నాయకులు


ఒంగోలు టౌన్: ఐద్వా 16వ రాష్ట్ర మహాసభలు ఈ నెల 13, 14, 15 తేదీల్లో అనంతపురంలో జరగనున్నాయని, జయప్రదం చేయాలని ఐద్వా నగర కార్యదర్శి జి.ఆదిలక్ష్మి పిలుపునిచ్చారు. నగరంలోని భగత్‌సింగ్ కాలనీ, మోటూరు ఉదయం కాలనీల్లో శుక్రవారం ఐద్వా పతాకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కల్తీ మద్యంతో నిరుపేద, సామాన్య కుటుంబాల్లో చిచ్చుపెడుతోందని ఆరోపించారు. విచ్చలవిడి మద్యం అమ్మకాలతో రాష్ట్రంలో అత్యాచారాలు పెరిగాయని, గృహ హింసతో మహిళలు ఇబ్బందిపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్త్రీ శక్తి పేరుతో అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణం ఎంతమందికి ఉపయోగపడుతోందో చెప్పాలని నిలదీశారు. అరకొర బస్సులతో ఈ పథకాన్ని ఎక్కువ మంది ఉపయోగించుకోలేకపోతున్నారని చెప్పారు. రాష్ట్రంలోని మహిళలందరికీ నెలకు రూ.1500 ఇస్తానని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఎప్పటి నుంచి ఈ పథకాన్ని అమలు చేస్తారో చెప్పాలని ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో మహిళా సమస్యల మీద విస్తృతంగా పోరాటాలు చేపడతామని ప్రకటించారు. కార్యక్రమంలో కె.విజయలక్ష్మి, బి.రాజ్యలక్ష్మి, గురవమ్మ, భూలక్ష్మి, రాజేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

బి.మాచవరం గ్రామంలో...

సంతనూతలపాడు: సమానత్వం, సమాన హక్కులు, చట్టాల సాధన కోసం ఉద్యమిస్తున్న ఐద్వా రాష్ట్ర 16వ మహాసభలను జయప్రదం చేయాలని ఐద్వా మండల కార్యదర్శి ఎస్.మాలతి పిలుపునిచ్చారు. మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని బి.మాచవరం గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఐద్వా జెండా ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజాస్వామ్యం, సమానత్వం, స్త్రీ విముక్తి లక్ష్యాలుగా 1981లో ఏర్పడిన ఐద్వా.. నేడు దేశవ్యాప్తంగా విస్తరించి మహిళల హక్కులు, చట్టాల సాధన కోసం పోరాడుతోందని తెలిపారు. ఈ నెల 13, 14, 15 తేదీలలో అనంతపురంలో మహాసభలను జయప్రదం చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు రాయపూడి ఆదెమ్మ, అన్నవరపు ఈశ్వరమ్మ, పిచ్చమ్మ, శైలజ తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం ఫలితాలపై దృష్టి పెట్టండి

చీమకుర్తి: రానున్న పదో తరగతి పరీక్ష ఫలితాలలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా దృష్టి కేంద్రీకరించాలని డిప్యూటీ డీఈఓ చంద్రమౌళేశ్వరరావు ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం సాయంత్రం డిప్యూటీ డీఈఓ ఆకస్మికంగా చీమకుర్తిలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో పాఠశాల అకడమిక్ విషయాలపై చర్చించారు. సబ్జెక్టుల వారీగా గత ఏడాది పరీక్ష ఫలితాలలో వచ్చిన మార్కులు, పర్సంటేజీ వివరాలడిగి తెలుసుకున్నారు. టీచర్‌లకు ఇచ్చిన హ్యాండ్‌బుక్స్‌ను పరిశీలించారు. తొలుత 10వ తరగతి, 7వ తరగతి విద్యార్థులతో మాట్లాడి వారి సిలబస్ గురించి, నైపుణ్యాల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు–1, 2 డీవీఎల్ నరసింహారావు, కే శివాజీ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ, పక్కన ఎంఈఓలు

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

ఒంగోలు డివిజన్

90102 24456, 90103 57744
90102 02762

Office mail : sakshiongads@gmail.com